నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 4 మే 2024 HYDERABAD

## చరిత్రను తిరగరాస్తాం: పద్మారావు గౌడ్



సికింద్రాబాద్ పార్లమెంట్‌లో లక్ష మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టించబోతున్నామని, ఇప్పటికే 11 శాతం ముందంజలో ఉన్నామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మా అన్న కేసీఆర్ నన్ను పిలిచి ఎంపీగా నిలబడు అని చెప్పి పంపించాడన్నారు.సికింద్రాబాద్ అసెంబ్లీ ప్రజల కష్ట సుఖాల్లో ఎలాగైతే ఉన్నానో.. పార్లమెంట్‌లో కూడా ప్రజల హక్కుల కోసం పోరాడుతానని హామీ ఇచ్చారు. నాడు గల్లీలో గెలిసినం..నేడు ఢిల్లీలో గెలుస్తామన్నారు. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ లాంటి వారు కార్పొరేటర్ ఎన్నికలప్పుడు వచ్చినా కూడా బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారని పద్మారావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్, నాంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆనంద్ గౌడ్, మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, కార్పొరేటర్లు సామల హేమ, లింగాని లక్ష్మీప్రసన్న, కంది శైలజ, రాసురి సునీత, పార్టీ సీనియర్ నాయకులు రామేశ్వర్ గౌడ్, కిశోర్ గౌడ్, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.





సీతాఫల్‌మండిలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, చిత్రంలో హాజరైన జనం

### అక్కరకు రాని చుట్టం కిషన్ రెడ్డి..

ఐదేండ్లలో రూపాయి పనిచేయని కిషన్‌రెడ్డి మనకు అక్కరకు రాని చుట్టమని కేటీఆర్ అన్నారు. ఐదేండ్ల పాటు కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి అటు రాష్ర్టానికి, ఇటు సికింద్రాబాద్ పార్లమెంట్‌కు ఆయన చేసిందేమి లేదని కేటీఆర్ మండిపడ్డారు. కాలనీలు వరదల్లో మునిగినా..కరోనా వచ్చినా , మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ, ఫ్లై ఓవర్లు కడతామన్న సహకారం అందించలేదన్నారు. కిషన్‌రెడ్డి చేసిందేమి అంటే.. ఒక కుర్ కురే ప్యాకెట్లు మాత్రం పంచాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గుజరాత్‌కు వరదలు వస్తే కేంద్రం రూ.వెయ్యి కోట్లు సాయం చేసిందని, రాష్ట్రం కోసం అడిగేందుకు కిషన్‌రెడ్డికి నోరు రాలేదా ? అని ప్రశ్నించారు. ఓట్లు అడిగే ముందు దమ్ముంటే కిషన్‌రెడ్డి ఐదేండ్లలో ఏం చేశావో చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. గులాబీ కండువాతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఖైరతాబాద్ ప్రజల తీర్పును అపహాస్యం చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ కండువాతో నిస్సిగ్గుగా ఓట్లు అడుగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. అవకాశవాదులు, విశ్వాసఘాతకుడికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

### పద్మారావుకు పట్టం కట్టండి

సికింద్రాబాద్ శాసనసభ్యుడే ఈ సారి పార్లమెంట్ సభ్యుడిగా పద్మారావు కాబోతున్నారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు తమ్ముడి లాంటి నేత పద్మారావు గౌడ్ అని, ఎన్ని కష్టాలు వచ్చినా సరే పద్మారావు కేసీఆర్‌తోనే నడిచారని, 40 ఏండ్ల ప్రజాజీవితంలో పేద ప్రజలకు కష్టం వస్తే ఏ గల్లీకి అయినా, ఎక్కడికైనా వెంటనే వాలిపోతాడు మన పజ్జన్న అని చెప్పారు. లక్ష మెజార్టీతో పద్మారావుకు పట్టం కట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పద్మారావును ఎంపీగా గెలిపిస్తే నాంపల్లిలో ఎంపీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని కేటీఆర్ అన్నారు.

# పజ్జన్నకు లక్ష మెజార్టీ ఇవ్వాలి



అడ్డగుట్ట రియో పాయింట్ వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్‌షోకు హాజరైన ప్రజలు

ఈ ఎన్నికల్లో అటు మోదీ..
ఇటు రేవంత్‌కు బుద్ధి చెప్పాలె

10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలిపించండి

ఏడాదిలో కేసీఆర్
రాష్ట్ర రాజకీయాలను మళ్లీ శాసిస్తారు

అక్కరకు రాని చుట్టం కిషన్‌రెడ్డి

మతం పేరిట రాజకీయం
చేసేటోళ్లకు గుణపాఠం చెప్పాలి

సికింద్రాబాద్ పార్లమెంట్
నియోజకవర్గ రోడ్ షోలో
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో, మే 3(నమస్తే తెలంగాణ): ప్రజల కష్టాలకు కారణమైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, అటు బడే భాయ్ మోదీ.. ఇటు చోటా భాయ్ రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ఇదే సరైన సమయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. 2014లో మోదీ మస్తు మాటలు చెప్పారని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల నగదు, ఇల్లు, ప్రతి ఇంటికి నల్లా, రైతుల ఆదాయం డబుల్, బుల్లెట్ ట్రైన్ అని పెద్ద పెద్ద మాటలు చెప్పారని, కానీ 12 ఏండ్లలో ఆయన చేసిందేమీలేదన్నారు. పేదలను కొట్టాలె.. పెద్దలకు పెట్టాలె అనేది నరేంద్ర మోదీ సిద్ధాంతమని, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి జన జీవనాన్ని ఆగం చేశాడని కేటీఆర్ మండిపడ్డారు. మన ముక్కు పిండి వసూలు చేసిన రూ.30 లక్షల కోట్లలో రూ.14.5 లక్షల కోట్లు ఆదానీ, అంబానీలకు రుణమాఫీ చేసిండు అని ఆరోపించారు. తాను చెప్పింది అబద్ధమని కిషన్‌రెడ్డి నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా సికింద్రాబాద్, సనత్‌నగర్, నాంపల్లి నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట రియో పాయింట్, సీతాఫల్‌మండి, సనత్‌నగర్‌లోని బబ్బార్ కాంప్లెక్స్, నాంపల్లిలోని నోబుల్ టాకీస్ చౌరస్తా వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. అలవి కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాలుగున్నర నెలల్లో ప్రజలకు కరెంట్, తాగునీటి కష్టాలు తెచ్చి పెట్టిందని, రేవంత్‌రెడ్డి చెప్పిన వాటిలో ఒక్కటైనా అమలు కాలేదన్నారు. కరెంట్ కోతలు, నీటి ఘోసలతో హైదరాబాద్‌లో మళ్లీ పాత రోజులు వచ్చాయన్నారు. ఈ ఎన్నికల్లో 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలిపిస్తే, మళ్లీ రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని కేటీఆర్ అన్నారు. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి బండి సంజయ్, అర్వింద్, సోయం బాపూరావు, రఘునందన్, ఈటల రాజేందర్‌లను ఓడించింది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.

### కాంగ్రెస్‌ను ఓడించాలి : తలసాని

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆరు గ్యారెంటీల్లో 5 హామీలను అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎంపీగా సికింద్రాబాద్‌కు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని తలసాని డిమాండ్ చేశారు. జై శ్రీరామ్ అంటేనే హిందువు అవుతారా? సనత్‌నగర్ నియోజకవర్గంలో తాను నిర్మించినన్నీ దేవాలయాలు ఎవరూ నిర్మించలేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే పద్మారావును భారీ మెజార్టీతో గెలిపించాలని తలసాని కోరారు.

భార్య వదిలిపెట్టిన మోదీకి

## మంగళ సూత్రం విలువ తెలియదు

సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు

బంజారాహిల్స్, మే 3 : ప్రధాని మోదీకి మహిళలు ధరించే మంగళసూత్రాల విలువ తెలియదని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని లేక్ వ్యూ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో దానం నాగేందర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల మంగళసూత్రాలు కూడా లాగేస్తారంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు మంగళసూత్రం ఎంత విలువైనదో, భార్య వదిలిపెట్టిపోయిన మోదీకి ఏం తెలుసు అంటూ దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపాయి. ప్రధాని మోదీ వ్యక్తిగత విషయాల గురించి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## స్ట్రీట్ లైట్ స్తంభానికి చేయి తగిలి..

విద్యుత్ షాక్‌తో హార్డ్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం



రుషి (ఫైల్)

బంజారాహిల్స్, మే 3: జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం సిబ్బంది పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి స్ట్రీట్‌లైట్ స్తంభానికి చేయి తాకడంతో కరెంట్ షాక్‌తో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరిగుట్ట గ్రామానికి చెందిన తుమ్మ భావన రుషి (35) హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ వెంకటగిరిలో నివాసం ఉంటున్నాడు. రెండేండ్ల క్రితం సుజాత అనే యువతితో ప్రేమ వివాహం కాగా, ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఇటీవల నూతన ఉద్యోగానికి రుషి సెలక్ట్ అయ్యాడు. గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో తన సర్టిఫికెట్లను జిరాక్స్ తీసుకుని వస్తానంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. జిరాక్స్ తీసుకున్న అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో కృష్ణానగర్ ప్రధాన రహదారి ఫుట్‌పాత్ పై నడుచుకుంటూ వెళ్తున్న రుషి చేయి స్ట్రీట్‌లైట్ పోల్‌కు తగిలింది. ఆ స్తంభానికి కరెంట్ వస్తుండటంతో షాక్‌కు గురై రుషి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఐపీసీ 304(ఏ) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కొత్త ఉద్యోగం వచ్చిందంటూ ఆనందంతో ఇంట్లోంచి వెళ్లిన భర్త నిమిషాల వ్యవధిలోనే మృత్యువు ఒడిలోకి చేరుకోవడంతో భార్య సుజాతను తీవ్రంగా కలచివేసింది.

# కండువాలు మార్చడమే కాంగ్రెస్ నైజం

## పేదల బతుకుల్లో వెలుగులు బీఆర్ఎస్‌తోనే సాధ్యం

దళిత ఆడబిడ్డపై పగబట్టిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు!

కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయం

ఓటమి భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు

విలేకరుల సమావేశంలో రావుల, మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, మే 3: కండువాలు మార్చడమే కాంగ్రెస్ నైజమని, పేదల బతుకుల్లో వెలుగులు బీఆర్ఎస్‌తోనే సాధ్యమని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ అభివృద్ధే ఊపిరిగా 30 ఏండ్ల పాటు సేవ చేసిన దివంగత ఎమ్మెల్యే సాయన్నను ప్రజలు మరిచిపోలేదన్నారు. ఈ మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ వైఖరితో పాటు ఎన్నికల ప్రచార సరళిపై శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు లీడర్లు, క్యాడర్ లేదని.. అందుకే బీఆర్ఎస్ నేతల ఇళ్ల చుట్టూ చక్కర్లు కొడుతూ, నైట్ వాచ్‌మన్ ఉద్యోగాలు చేస్తున్నారని విమర్శించారు. చివరకు కాంగ్రెస్‌కు అభ్యర్థి కూడా లేకపోవడంతో ఇతర పార్టీల నుంచి తెచ్చుకున్నారని చురకలంటించారు. బీఆర్ఎస్ నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ, వినకుంటే బెదిరిస్తూ బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమా? అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయమని, తేలాల్సింది మెజార్టీయేనని రావుల శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సాయన్న కూతురు నివేదితను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దళిత ఆడబిడ్డ తండ్రిని, చెల్లిని కోల్పోయి పుట్టెడం దుఃఖంలో ఉంటే ఆ కుటుంబానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ టికెట్ ఇచ్చారని తెలిపారు. కానీ, కనీస జ్ఞానం లేని కాంగ్రెస్, బీజేపీలు పోటీలో నిలబడి, ఆడబిడ్డపై నిందలు వేయడమేమిటని మండిపడ్డారు. గతంలో ఒకే పార్టీలో ఉన్న నేతలు సాయన్నతో ఉన్న మిత్రృత్వాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి , మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

### నివేదితకు అండగా నిలవాలి: ఎమ్మెల్యే మర్రి

ఏడాదికాలంలో తండ్రిని, చెల్లిని కోల్పోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు అందరూ అండగా నిలవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. నివేదితను ఏకగ్రీవంగా గెలిపించుకోవాల్సింది పోయి, బలవంతంగా బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటోందని ధ్వజమెత్తారు. సొంత ఇల్లు కూడా లేని సాయన్న కుటుంబానికే ప్రజలంతా సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని గుర్తుచేశారు. మరోవైపు కేంద్ర సర్కారు కంటోన్మెంట్‌కు రావాల్సిన సర్వీస్ చార్జీలను విడుదల చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

### ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారు: బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

రేవంత్ రెడ్డి, మైనంపల్లి లాంటి నేతలు వ్యక్తిగతంగా కక్ష గట్టి తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఆరోపించారు. ప్రచారంలో తనకు లభిస్తున్న స్పందనను చూసి కాంగ్రెస్ నేతలు ఓర్వలేక పోతున్నారని అన్నారు. దళిత ఆడబిడ్డనైన తనపై హస్తం నేతలు ఇంత కక్ష కట్టడం ఎందుకు అని ప్రశ్నించారు. 30 ఏండ్లు ప్రజలకు సేవ చేసిన సాయన్న బిడ్డను ఎందుకు వేధిస్తున్నారని నిలదీశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తనను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోక్‌నాథ్, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, హరి, నర్సింహ ముదిరాజ్‌తో పాటు పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళా నేతలు, సాయన్న అభిమానులు పాల్గొన్నారు.